క్లుప్తంగా

శివాలయంలో గోపూజ

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని శ్రీ ఇష్ట కామేశ్వరీ సమేత శ్రీ స్వయంభు శంభులింగేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతిపూజ, పుణ్యాహవచనం, మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సహస్రనామార్చన, మహాలింగార్చన, పుష్పార్చన అనంతరం గోపూజ చేశారు. కార్యక్రమంలో ఈఓ శంభిరెడ్డి, అర్చకులు విష్ణువర్ధన్‌శర్మ, ధనుంజయశర్మ, చైర్మన్ శంభిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సివిల్ జడ్జి పూజలు

శివాలయంలో హుజూర్‌నగర్ సీనియర్ సివిల్ జడ్జి రాధాకృష్ణ చౌహాన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు అర్చకులు స్వాగతం పలికారు. స్వామివారి ఆశీర్వచనాలు అందజేసి, స్వామి వారి శేష వస్త్రం, పూలమాలతో సత్కరించారు.

శివుడికి రుద్రాభిషేకం

నేరేడుచర్ల : శ్రావణ మాసం సందర్భంగా నేరేడుచర్లలోని శ్రీధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆలయంలో సోమవారం మట్టి శివలింగానికి రుద్రాభిషేకం చేశారు. ఆలయ ప్రధాన పూజారి ఆశీష్ దివేది ఆధ్వర్యంలో మట్టితో ప్రత్యేకంగా చేసిన శివలింగానికి వేదమంత్రోత్సవాల నడుమ పంచామృతాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కొణతం కృష్ణారెడ్డి, పేరబోయిన వీరయ్య, చింతకుంట్ల పూర్ణచంద్రారెడ్డి, యారవ సురేష్, పులిజాల వెంకటరమణారావు, దుర్గారావు, శ్రీనివాస్, లక్ష్మారెడ్డి, అనిల్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

5లోపు సప్లిమెంటరీ పరీక్ష ఫీజు చెల్లించాలి

నడిగూడెం : ఓపెన్ టెన్త్, ఇంటర్మీడియట్‌లో గత ఏడాది, అంతకుముందు విద్యా సంవత్సరంలో ఫెయిల్ అయిన వారు సెప్టెంబర్‌లో నిర్వహించనున్న సప్లిమెంటరీ పరీక్షల కోసం వచ్చే నెల 5వ తేదీ లోపు పరీక్ష ఫీజు చెల్లించాలని నడిగూడెం స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ ఎం.శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతిలో సబ్జెక్టుకు రూ.100, ఇంటర్మీడియట్‌లో సబ్జెక్టుకు రూ.150 చొప్పున మీ సేవాలో ఆన్‌లైన్‌లో చెల్లించి, రశీదును పాఠశాలలో అసిస్టెంట్ కోఆర్డినేటర్ బి.సత్యనారాయణకు ఇవ్వాలని ఆయన తెలిపారు.

స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

గరిడేపల్లి : మండలంలోని గడ్డిపల్లి గ్రామంలో గల పీఎంశ్రీ ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జంపాల ప్రసన్న కుమారి సోమవారం తెలిపారు. 6వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో చేరేందుకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

పరిశుభ్రత పాటించాలి

కోదాడ : ప్రతిఒక్కరూ పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని వైద్యాధికారిని యాట బిందు సూచించారు. సోమవారం మోతె మండలంలోని మామిళ్లగూడెం గ్రామంలో గల ప్రభుత్వ పాఠశాలలో ఆమె పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించి మాట్లాడారు. వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని ఆమె పరిశీలించారు. ప్రధానోపాధ్యాయుడు రామనర్సయ్య, ఉపాధ్యాయులు కవిత, నళిని, ఏఎన్ఎం నిర్మల, ఫనిజారాణి, ఆశావర్కర్లు ఉన్నారు.

నాటిన ఈత మొక్కలను సంరక్షించాలి



ఈత మొక్కలు నాటుతున్న ఎంపీడీఓ, ఎక్సైజ్ ఎస్‌ఐ

మునగాల : మండలంలోని రేపాల గ్రామ పరిధిలో గల గౌడ సొసైటీ భూమిలో సోమవారం ఎంపీడీఓ కె.రమేష్‌దీనదయాళ్, ఎక్సైజ్ ఎస్‌ఐ రామకృష్ణ ఈత మొక్కలు నాటడాన్ని ప్రారంభించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ గౌడ సొసైటీకి చెందిన నాలుగు ఎకరాల భూమిలో గతంలో రెండు ఎకరాల్లో ఈత మొక్కలు నాటామని, మిగిలిన రెండు ఎకరాల్లో 800 ఈత మొక్కలు నాటాల్సి ఉందన్నారు. నాటిన ఈత మొక్కలను గీత కార్మిక సంఘం సభ్యులు సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధి హామీ ఏపీఓ శైలజ, టీఏ శేఖర్, పంచాయతీ కార్యదర్శి మైనంపాటి బ్రహ్మరెడ్డి, ఎక్సైజ్ శాఖ సిబ్బంది అజర్‌అలీ, నరేష్, సలీమ్, ఫీల్డ్ అసిస్టెంట్ సావిత్రి, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

హెపటైటీస్‌పై అవగాహన అవసరం

గరిడేపల్లి : హెపటైటీస్ వ్యాధిపై ప్రతిఒక్కరికీ అవగాహన అవసరమని మండల వైద్యాధికారి నరేష్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు హెపటైటీస్ వ్యాధిపై అవగాహన కల్పించి మాట్లాడారు. ఈ వ్యాధి కలుషిత నీరు, ఆహారం వలన వస్తుందన్నారు. కొన్ని రకాల వైరస్‌లతో కూడా ఈ వ్యాధి వ్యాపిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎస్ శారద, సూపర్‌వైజర్స్ అంజయ్యగౌడ్, వెంకటరమణ, ఎంఎల్‌హెచ్‌పీలు అశోక్, సాయికుమార్, ఎల్డీ ఉపేందర్, స్టాఫ్‌నర్సు యశోద, హెల్త్ అసిస్టెంట్ సరస్వతి, కవిత, విజయ, రాజకుమారి, అంజలి, అరుణ, సైదమ్మ తదితరులు పాల్గొన్నారు.

12 గదులు.. ఇంకెన్నాళ్లు పనులు!

- మూడేళ్లైనా అసంపూర్తిగానే బాలుర ఉన్నత పాఠశాల భవన నిర్మాణం
- వంటగది, డైనింగ్ హాల్ కూడా..
- పాఠశాలలో 600 మంది విద్యార్థులు
- సరిపడా గదులు లేక వరండాలు, చెట్ల కింద పాఠాల బోధన
- రేకుల షెడ్డు కింద వంటలు



అసంపూర్తిగా అదనపు తరగతి గదుల నిర్మాణం

కోదాడ : పట్టణ నడిబొడ్డున ఉన్న కోదాడ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల అసౌకర్యాలతో కునారిల్లుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని చెబుతున్న అధికారులు జిల్లాలోనే అత్యధికంగా ఆరువందల మంది విద్యార్థులున్న ఈ పాఠశాలలో మాత్రం కనీస వసతులు కల్పించలేకపోతున్నారు. పాఠశాలలో విద్యార్థులకు సరిపడా గదులు లేకపోవడంతో నూతన తరగతి గదుల నిర్మాణాన్ని దాదాపు రెండు కోట్ల రూపాయలతో చేపట్టి మూడు సంవత్సరాలు అవుతున్నా నేటికీ పూర్తి కాలేదు. కాంట్రాక్టర్ 90 శాతం పనులను పూర్తి చేశాడు. సకాలంలో బిల్లులు రావడం లేదని నిలిపివేశాడు. దీంతో ప్రస్తుతం ఉన్న గదులు సరిపోక విద్యార్థులకు వరండాలో, చెట్ల కింద పాఠాలు బోధించాల్సిన పరిస్థితి నెలకొంది. మరుగుదొడ్లు కూడా సరిగా లేక విద్యార్థినులు ఇబ్బంది పడుతున్నారు.

రూ.10 లక్షలొస్తే పనులు పూర్తి..

మన ఊరు– మన బడి కార్యక్రమంలో భాగంగా కోదాడ బాలుర ఉన్నత పాఠశాలలో దాదాపు రెండు కోట్ల రూపాయలతో నూతన భవన నిర్మాణ పనులు చేపట్టారు. 12 అదనపు తరగతి గదులు నిర్మించారు. పనులు 90 శాతం పూర్తయ్యాయి. గదులలో ఫ్లోరింగ్, కిటికీలకు, దర్వాజలకు తలుపులు, విద్యుత్ సౌకర్యం కల్పించాలి. భవనానికి రంగులు వేయాలి. కానీ బిల్లులు రాకపోవడంతో తను భరించలేనని కాంట్రాక్టర్ పనులను ఆపివేశాడు. కొద్దిగా బిల్లులు ఇచ్చినా పనులను పూర్తిచేస్తానని కాంట్రాక్టర్ చెపుతున్నాడు. మరో 10 లక్షల రూపాయలు ఖర్చు చేస్తే పనులు పూర్తయి 12 గదులు అందుబాటులోకి వస్తాయి. కానీ అధికారులు గాని, ప్రజాప్రతినిధులు గాని పట్టించుకున్న దాఖలాలు లేవు.



సగంలోనే ఆగిపోయిన డైనింగ్ హాల్ నిర్మాణం



పాఠశాలలో రేకుల షెడ్డే వంట గది

మరుగుదొడ్లైనా కట్టేనా..

కోదాడ బాలుర పాఠశాలలో రెండు వందల మంది వరకు బాలికలు చదువుతున్నారు. వీరికి సరిపడా బాత్‌రూంలు లేవు. ఉన్నవి కూడా సక్రమంగా లేవు. ఇటీవల పాఠశాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ బాత్‌రూంల సమస్యను గుర్తించి వెంటనే రూ.7 లక్షల మంజూరు చేశాడు. ఈ నిధులతో వెంటనే బాత్‌రూంల నిర్మాణం పూర్తిచేయాలని ఆయన అదేశించారు. కానీ పనులు ఇంకా ప్రారంభం కాలేదు. ఈ పనులైనా వెంటనే చేపట్టి పూర్తి చేస్తే బాలికలకు కొంత ఉపశమనం కలుగుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

రేకుల కింద వంట..

పాఠశాలలో వంట గదుల నిర్మాణం అసంపూర్తిగా ఉండడంతో ఆరు బయట రెండు రేకులు వేసుకొని వంట చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. లక్షల రూపాయలతో నిర్మించిన డైనింగ్ హాల్ కూడా అసంపూర్తిగా ఉంది. దీంతో దానిని పాత సమన్లు వేయడానికి ఉపయోగిస్తున్నారు. విద్యార్థులేమో చెట్ల కింద భోజనం చేయాల్సి వస్తోంది. ఇదిలా ఉండగా పాఠశాలలో గతంలో నిర్మించిన ఇండోర్ స్టేడియం.. పాఠశాల ఆవరణ కన్నా కిందకు ఉండడంతో వర్షం వచ్చినప్పుడు దానిలో నీరు నిలుస్తోంది. ఒక అ డుగు ఎత్తు పెంచాలని ఉపాధ్యాయులు, విద్యార్థులు అధికారులను, ప్రజాప్రతినిధులను కోరుతున్నారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న షీటీం కానిస్టేబుల్ సాయిజ్యోతి

హుజూర్‌నగర్ : ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని షీటీం కానిస్టేబుల్స్ సాయి జ్యోతి, నాగేంద్రబాబు అన్నారు. సోమవారం హుజూర్‌నగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో షీ టీం ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థినుల పట్ల ఎవరైన తప్పుగా ప్రవర్తిస్తే నేరుగా షీ టీంకు తెలియజేయాలని వారి పేర్లు గోప్యంగా ఉంచుతారని తెలిపారు. అదేవిధంగా వాట్సాప్, స్నాప్‌చాట్, ఇన్‌స్టాగామ్ ఉపయోగించడంతో కలిగే లాభాలు, నష్టాలు వివరించారు. పోక్సో చట్టం గురించి తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డి.బ్రహ్మాచారి, అధ్యాపకులు శ్రీనివాస్‌రెడ్డి, నరసింహారావు, నరసింహారాజు, నాగుల్‌మీరా, రమణారెడ్డి, రవిబాబు, శోభారాణి, ఉపేంద్ర, మహేష్, తేజ, శ్రీకాంత్, జ్యోతి, రామ్మూర్తి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ నరసింహారావు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని పేదలకు ఇవ్వాలని వినతి

నడిగూడెం : మండలంలోని చాకిరాల పరిధిలో ఉన్న 88, 89 సర్వే నంబర్లలో గల ప్రభుత్వ భూమిని చాకిరాల గ్రామానికి చెందిన పేదలకు ఇవ్వాలని కోరుతూ మాతంగి యేసుబాబు ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో ఇదే సర్వే నంబర్ భూమిలో ప్రభుత్వం గోదాములు నిర్మించేందుకు ముందుకొస్తే పలువురు అడ్డుకున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో చాకిరాలకు చెందిన పలువురు ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



కళాజాత నిర్వహిస్తున్న కళాకారులు

మునగాల : పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని తెలంగాణ సాంస్కృతిక సారథి జిల్లా టీమ్ లీడర్ పల్లెల లక్ష్మణ్ అన్నారు. సోమవారం మండలంలోని జగన్నాథపురంలో నిర్వహించిన కళాజాతలో ఆయన మాట్లాడారు. వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రతిఒక్కరూ తమ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు పాలకుర్తి శ్రీకాంత్, పల్లెల రాము, గంట భిక్షపతి, గద్దం ఉదయ్, పాక ఉపేందర్, మాగి శంకర్, కందమల్ల నాగలక్ష్మి, గజ్జి మంజుల, సిరపంగి రాధ, మల్లమ్మ, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు బోనాలు



బోనాలతో ఆలయానికి వెళ్తున్న మహిళలు

కోదాడ : మోతె మండలంలోని హుస్సేన్‌బాద్ గ్రామంలో సోమవారం ముత్యాలమ్మ బోనాల పండుగను గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలు ఎత్తుకొని డప్పు చప్పుళ్లతో ఊరేగింపుగా దేవాలయానికి చేరుకొని అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. గ్రామ దేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు.

ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు

నడిగూడెం : ఆయిల్ పామ్ తోటల సాగుతో అధిక లాభాలు పొందవచ్చని పతంజలి ఆయిల్ పామ్ కంపెనీ కోదాడ డివిజన్ ఫీల్డ్ ఆఫీసర్ వెంకట్ తెలిపారు. సోమవారం నడిగూడెం మండలం కరివిరాలకు చెందిన కడకంచి కమలమ్మ వ్యవసాయ క్షేత్రంలో ఆయిల్ పామ్ తోటల సాగులో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రస్తుత మార్కెట్‌లో ఆయిల్ పామ్ తోటల సాగుకు బాగా డిమాండ్ ఉందన్నారు. ఆయిల్ పామ్ తోటలు నాటిన నాలుగో సంవత్సరం నుంచి పంట దిగుబడి వస్తుందన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహం కూడా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ తొండల నరేష్, రైతులు పాల్గొన్నారు.



కరివిరాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వెంకట్

గోదాదేవికి ప్రత్యేక పూజలు



పూజలో పాల్గొన్న భక్తులు

హుజూర్‌నగర్ : మండలంలోని బూరుగడ్డలో గల శ్రీఆదివారహ లక్ష్మీనరసింహ వేణుగోపాలస్వామి వారి దివ్యక్షేత్రంలో శ్రీగోదాదేవి అమ్మవారి పుట్టిన రోజు సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాత సేవ, అమ్మవారికి నవ కలశ అభిషేకం, తులసి పూజ, పుష్పాలంకరణ చేశారు. కుంకుమార్చన, ఆరగింపు, మంగళాశాసనం, పల్లకీ సేవ తదుపరి నీరాజన మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వినియోగం గావించారు. కార్యక్రమంలో పూజారులు, ఆలయ చైర్మన్, ధర్మకర్తలు, అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య రణభేరి సభను జయప్రదం చేయాలి



హుజూర్‌నగర్ : రణభేరి సభ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆర్యవైశ్య నాయకులు

హుజూర్‌నగర్ : హైదరాబాద్‌లో ఆగస్టు 3న నిర్వహించబోయే ఆర్యవైశ్య రాజకీయ రణభేరి సభను విజయవంతం చేయాలని ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు వెంపటి వెంకటేశ్వరరావు కోరారు. సోమవారం హుజూర్‌నగర్‌లో ఆర్యవైశ్య రణభేరి పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం నాయకులు, నూనె నాగన్న, గరిణె శ్రీధర్, వి.పురుషోత్తం, వి.నాగేశ్వరరావు, పి.అశోక్‌కుమార్. వి.నరసింహారావు, పి.లక్ష్మీనరసింహరావు, పి.వెంకటేశ్వర్లు, జి.విద్యాసాగర్, శ్రీకాంత్, అనంతరాములు, శ్రీమన్నారాయణ, ఆనంద్, నారాయణరావు, వెంకన్న, చిరంజీవి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో ఆర్యవైశ్యులు పోటీ చేయాలి

నేరేడుచర్ల : హైదరాబాద్‌లోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఆగస్టు 3వ తేదీన నిర్వహించబోయే ఆర్యవైశ్య రాజకీయ రణభేరి సభ వాల్ పోస్టర్‌ను సోమవారం నేరేడుచర్లలో సంఘం జిల్లా అధ్యక్షుడు వెంపటి వెంకటేశ్వర్లు విడుదల చేశారు. అనంతరం పాలకవీడు, నేరేడుచర్ల మండలాల సమాయత్త సమావేశంలో పాల్గొని మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆర్యవైశ్యులు పోటీ చేయాలని, వారి కోసం జిల్లా ఆర్యవైశ్య సంఘం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి నూనె నాగన్న, జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి గరిణె శ్రీధర్, సంఘం నాయకులు రాచకొండ శ్రీనివాస్‌రావు, కందిబండ శ్రీనివాస్‌రావు, నర్సింహరావు, అంజయ్య, భిక్షపతి, వెంకటేశ్వర్లు, లక్ష్మణ్, కృష్ణమూర్తి, సత్యనారాయణ, నటరాజ్, అశోక్, లక్ష్మీనర్సింహరావు, కోటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య రణభేరి సభ పోస్టర్ ఆవిష్కరణ..

గరిడేపల్లి : మండల కేంద్రంలోని అయ్యప్పస్వామి ఆలయంలో సోమవారం మండల ఆర్యవైశ్య సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య రణభేరి సభ పోస్టర్‌ను ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు వెంపటి వెంకటేశ్వరరావు, మండల అధ్యక్షుడు ఓరుగంటి శ్రీనివాస్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో గరినే శ్రీధర్, నూనె నాగన్న, ఓరుగంటి పురుషోత్తం, తాటికొండ లక్ష్మణ్, నరసింహారావు, గెల్లి సతీష్, వీరమల్ల రమేష్, శ్రీరంగం ప్రసాద్, రత్నాకర్, బూరుగు శంకర్, పబ్బతి సురేష్, వీరస్వామి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మేళ్లచెరువు : ఆర్యవైశ్య రాజకీయ రణభేరిని విజయవంతం చేయాలని ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు వెంపటి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో ఆ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వరగాని నాగరాజు, సంగయ్య, విజయశంకర్, రామారావు, నరసింహారావు, గురునాథం, సతీష్, సాయి, గురునాథం, గోపి పాల్గొన్నారు.

మఠంపల్లి : ఆర్యవైశ్య రణభేరి సభ పోస్టర్‌ను ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వెంపటి వెంకటేశ్వరరావు సోమవారం మఠంపల్లిలో జరిగిన ఆ సంఘం మండల సమావేశంలో ఆవిష్కరించారు. సమావేశంలో గరిణె శ్రీధర్, నూనె నాగన్న, ఓరుగంటి పురుషోత్తం, కుక్కడపు రామారావు, ముత్తా వెంకటేశ్వర్లు, బొగ్గవరపు రాధాకృష్ణమూర్తి, వంగవేటి వేణుగోపాలరావు, చిన్నరామారావు, నాగేషు, వెంకటేశ్వర్లు, ఆంజనేయులు, శ్రీరాములు, పాల్గొన్నారు.

జీలుగతో భూసారం

చిలుకూరు : వరి సాగుకు ముందు జీలుగలు వేయడం వల్ల భూసారం పెరుగుతుందని మండల వ్యవసాయ శాఖ ఏఈవోలు శిరీష, త్రివేణి తెలిపారు. సోమవారం చిలుకూరులో రైతులు చేపట్టిన జీలుగ సాగును పరిశీలించి మాట్లాడారు. జీలుగ పచ్చిరొట్టె ఎరువుగా ఉపయోగపడుతుందని అన్నారు. రైతులు రసాయన ఎరువులు తగ్గించి సేంద్రియ సాగుకు మొగ్గు చూపాలని సూచించారు. రైతులు కొడారు సైదయ్య తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి రహిత సమాజం కోసం కృషిచేయాలి

కోదాడ : కుష్టు వ్యాధి రహిత సమాజం కోసం కృషిచేయాలని డాక్టర్ పీఎంఓ సకల్‌రెడ్డి అన్నారు. సోమవారం మోతె మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రాష్ట్ర కుష్టు వ్యాధి నివారణ బృందం సభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా పీహెచ్‌ఎసీలో రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం వైద్య ఆరోగ్య సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించి మాట్లాడారు. మండలంలో లెప్రసీ కేసులు ఎన్ని గుర్తించారని ఆరోగ్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బృందం సభ్యులు డీఎస్‌ఓ సురేందర్‌రెడ్డి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్‌కార్డుల జారీ నిరంతర ప్రక్రియ

- కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ



చిలుకూరులో లబ్ధిదారులకు రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్న కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ

చిలుకూరు : రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ తెలిపారు. సోమవారం చిలుకూరు మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో లబ్ధిదారులకు ఆయన నూతన రేషన్‌కార్డులు పంపిణీ చేసి మాట్లాడారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ రేషన్‌కార్డులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. అర్హులు నూతన రేషన్ కార్డుల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. చిలుకూరు మండల వ్యాప్తంగా ఇప్పటివరకు 1218 నూతన రేషన్‌కార్డులు మంజూరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ధ్రువకుమార్, డిప్యూటీ తహసీల్దార్ కరుణ శ్రీ, ఆర్ఐలు మంత్రిప్రగడ సీతారామచందర్‌రావు, శ్వేత, బేతవోలు పీఏసీఎస్ చైర్మన్ బజ్జూరి రవీందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కీత వెంకటేశ్వర్లు, పిండ్రాతి హనుమంతరావు, గ్రామ శాఖ అధ్యక్షుడు సొందుమియా, కాంగ్రెస్ నాయకులు, డీలర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

అనుమానితులు కనిపిస్తే సమాచారం ఇవ్వండి



రైస్ మిల్లులో ఇతర రాష్ట్రాల కార్మికుల వేలిముద్రలు తనిఖీ చేస్తున్న పోలీసులు

నేరేడుచర్ల : అనుమానితులు కనిపిస్తే 100 నంబర్‌కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని నేరేడుచర్ల ఎస్ఐ రవీందర్‌నాయక్ అన్నారు. సోమవారం నేరేడుచర్ల మండలం చిల్లేపల్లిలోని పార్ బాయిల్డ్ రైస్ మిల్లులో ఇతర రాష్ట్రాల కార్మికుల వేలి ముద్రలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేలిముద్రల తనిఖీ చేయడం ద్వారా వారికి ఏమైన నేర చరిత్ర ఉంటే తెలుసుకోవచ్చని, తద్వారా నేరాలను అరికట్టవచ్చన్నారు. గంజాయి వాడకం, రవాణా మీద ప్రత్యేక నిఘా పెట్టినట్లు తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై శ్రద్ధ వహించాలని అన్నారు. గంజాయి సేవించిన, రవాణా చేసినా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రభుత్వ పెన్షనర్ల జన్మదిన వేడుకలు



జన్మదిన వేడుకల్లో సత్కారం పొందిన ప్రభుత్వ పెన్షనర్లు

హుజూర్‌నగర్ : ఉద్యోగుల బేసిక్‌లో ఒక శాతం ప్రభుత్వానికి జమ చేస్తామని ఉద్యోగ సంఘాలు ముందుకు వచ్చినప్పటికీ వారికి క్యాష్ లెస్ వైద్యం అందించడంలో ప్రభుత్వం వైఫల్యం చెందుతోందని ప్రభుత్వ పెన్షనర్ల సంఘం మండల గౌరవ అధ్యక్షుడు అంకతి అప్పయ్య విమర్శించారు. సోమవారం హుజూర్‌నగర్‌లోని ప్రభుత్వ పెన్షనర్ల కార్యాలయంలో పెన్షనర్ల సామూహిక జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పుట్టినరోజు జరుపుకున్న పెన్షనర్లను శాలువాలతో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల హెల్త్ కార్డులు సక్రమంగా అమలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తుందని ఆరోపించారు. దీంతో అనేకమందికి సక్రమంగా వైద్యం అందక మరణిస్తున్నారని అన్నారు. ప్రభుత్వం తక్షణమే హెల్త్ కార్డులను జారీ చేసి అమలు చేయాలని కోరారు. అలాగే డీఏ బకాయిలు, పీఆర్సీ ఇవ్వాలని కోరారు. సమావేశంలో పెన్షనర్ల సంఘం నాయకులు చెన్న సోమయ్య, ఎంటీ దేవదానం, కొప్పుల వీరారెడ్డి, రఘునాథ్, ఎంఎస్ఎన్ రాజు, పారుపల్లి చంద్రశేఖర్, రామలక్ష్మి, ధర్మూరి వెంకటేశ్వర్లు, కేవీఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

1న హుజూర్‌నగర్‌లో పింఛన్‌దారుల సదస్సు



సమావేశంలో పాల్గొన్న నాయకులు

మునగాల : హుజూర్‌నగర్‌లో ఆగస్టు ఒకటవ తేదీన నిర్వహించబోయే చేయూత పింఛన్‌దారుల సదస్సును జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ రాష్ట్ర నాయకుడు వడ్డేపల్లి కోటేష్ మాదిగ, వీహెచ్‌పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి, మునగాల మండల ఇన్‌చార్జ్ పేరెల్లి బాబు పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని హరిజన కాలనీలో ఎంఎస్పీ మండల శాఖ అధ్యక్షుడు లంజేపల్లి శ్రీనుమాదిగ అధ్యక్షతన జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, వీహెచ్‌పీఎస్ నాయకులు సొంపంగు మైసమ్మ, వేంపంగు వెంకటమ్మ, కృష్ణ, లంజేపల్లి నర్సమ్మ, మంగమ్మ, బొడ్డు తిరపమ్మ, బండారు నాగమ్మ, కొమ్ము యశోద, నాగవల్లి ముత్తమ్మ, సిరపంగు వెంకన్న, చినరాములు పాల్గొన్నారు.

పింఛన్‌దారుల మహాగర్జన సదస్సుకు మద్దతు

హుజూర్‌నగర్ : హైదరాబాద్‌లో ఆగస్టు 13న నిర్వహించబోయే చేయూత పింఛన్‌దారుల మహాగర్జన సదస్సుకు భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్ తెలిపారు. సోమవారం హుజూర్‌నగర్‌లో నిర్వహించిన ఆ సంఘం నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆగస్టు1న హుజూర్‌నగర్‌లో జరిగే చేయూత పెన్షన్‌దారుల జిల్లా సదస్సుకు పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ హాజరవుతున్నట్లు తెలిపారు. సదస్సుకు చేయూత పింఛన్‌దారులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. సంఘ నాయకులు పాల్గొన్నారు.

అధ్వానంగా సీసీ రహదారులు



అధ్వానంగా లకారం రోడ్డు

హుజూర్‌నగర్ : పట్టణంలోని పలు రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. వర్షాలకు పలు కాలనీల్లో మట్టి దారులు బురదమయంగా మారాయి. చాలా ఏళ్ల క్రితం నిర్మించినవి కావడంతో పలు చోట్ల సీసీ రోడ్లు ధ్వంసమయ్యాయి. మిషన్ భగీరథ పైపుల నిర్మాణానికి ఇళ్ల ముందు తీసిన గుంతలలో వర్షపు నీరు నిలుస్తున్నాయి. దీంతో ఆయా రోడ్లపై రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్లపై గుతలను పూడ్పించాలని కోరుతున్నారు.

బేటీ బచావో, బేటీ పడావోపై అవగాహన

గరిడేపల్లి : బేటీ బచావో బేటీ పడావో పథకంపై విద్యార్థినులు అవగాహన కలిగి ఉండాలని చైల్డ్ వెల్ఫేర్ జిల్లా కోఆర్డినేటర్ చైతన్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో బేటీ బచావో, బేటీ పడావో పథకంపై అవగాహన కల్పించి మాట్లాడారు. బాలికల సంక్షేమం, చదువు కోసం ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. బాలికలకు జీవితంలో ఎన్ని సమస్యలు ఎదురైన ధైర్యంగా ఎదుర్కొని నిలబడాలని అన్నారు. గురువులను, తల్లిదండ్రులను గౌరవించాలన్నారు. చదువులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ కుక్కడపు వినోద్, ఎంటీఎస్ భవ్యశ్రీ, పాఠశాల ఎస్ఓ శైలజ, ఉపాధ్యాయులు కల్పన, సిబ్బంది పాల్గొన్నారు.

● నిర్లక్ష్యంగా వదిలేశారు !

కోదాడ మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యానికి ఈ ఫొటో ప్రత్యక్ష సాక్ష్యం. మున్సిపాలిటీకి చెందిన చెత్త సేకరణ ఆటో ఇది. దీనిని చాలా రోజులుగా గుడిబండ రోడ్డులో.. రోడ్డు పక్కన ఇలా వదిలేశారు. ఒకవేళ మరమ్మతులకు గుర్తై తే తీసుకెళ్లి మున్సిపాలిటీ యార్డు వద్ద ఉంచాలి. కానీ అధికారులు ఇలా వదిలేయడంతో చెత్త ఆటోను చెత్తలోనే వేశారని స్థానికులు అంటున్నారు. – కోదాడ



గుడిబండ రోడ్డులో వదిలేసిన చెత్త ఆటో